
సాక్షి
ఒడిశా

గురువారం । 23 । జనవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 4,46,280
బంగారం: 4 గ్రాములు
వెండి: 6 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం

సెంచూరియన్ వర్సిటీలో 'వాతావరణ మార్పులతో స్మార్ట్ వ్యవసాయం' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది.

- 8లో.



ధాన్యం కొనుగోలు చేస్తాం

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 77వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని సి.ఎస్.ఓ. ప్రపుల్ల కుమార్ నాయక్ తెలిపారు.

- 8లో.

గజపతి జిల్లాలో.. బాలికల నిష్పత్తి భేష్

• జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా



బాలింతలకు బహుమతి ఇచ్చి ప్రోత్సహిస్తున్న జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు



ఆడపిల్లల తల్లులకు బహుతులను అందజేస్తున్న జిల్లా ఎస్పీ జితేంద్ర నాథ్ పండా



జిల్లా స్థాయి బేటీ బచావ్ ఉత్సవంలో మాట్లాడుతున్న మనోరమా దేవి



పదేళ్ల బేటీ బచావ్, బేటీ పడావ్ ఉత్సవంలో మాట్లాడుతున్న సామాజిక సంక్షేమశాఖ అధికారిని మనోరమా దేవి



డ్యాన్సు వేస్తున్న బాలాశ్రమం బాలికలు

పర్లాకిమిడి: రాష్ట్రంలో ఇతర జిల్లాల కంటే గజపతిలో మగవారికంటే ఆడపిల్లల సంతానం నిష్పత్తి ఎక్కువగా ఉందని (1000:1046).. ఇది ఎంతో శుభపరిణామమని జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా అన్నారు. ఆడపిల్లలు కన్నవారికి తల్లికంటే తండ్రితో అనుబంధం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. వారిలో ఒక కూతురు, తల్లి, కోడలు, అమ్మ, అత్త, నాన్నమ్మగా సమాజంలో ప్రతిబింబిస్తారని ఎస్పీ పండా అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బేటీ బచావ్, బేటీ పడావ్ పదేళ్ల పాలనోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవానికి అతిథులుగా జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, ఆదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ ముబారక్ ఆలీ, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి డాక్టర్ గుణనిధి నాయక్, శిశుసంరక్షణ సమతి చైర్మన్ అశ్వినీ కుమార్ మహాపాత్రో విచ్చేయగా జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి అధ్యక్షత వహించారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో మగపిల్లలతో పోటీపడి స్థిరపడుతున్నారని, ఆడపిల్లలు ఇంటికి శుభదాయకమని మనోరమా దేవి అన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు బాలింతలకు జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, జిల్లా పరిషత్ అధ్యక్షులు తిరుపతిరావు బహుమతులు అందజేసి ప్రోత్సాహించారు. అనంతరం బాలాశ్రమం (బి.సీతాపురం) బాలికలు నృత్యగీతాలతో ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో సీడీపీవోలు (రాయఘడ) బి.కోమలాంగి, (గుసాని) నమితా మహారాణా, గుమ్మనుండి పుష్పాంజలి సాహు, అర్చనా మంగరాజ్, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎస్‌ఓడీసీ సభ్యులుగా సప్తగిరి, సత్యజీత్





సప్తగిరి శంకర్ ఉలక సత్యజీత్ గొమాంగో

రాయగడ: దక్షిణ ఒడిశా అభివృద్ధి మండలి(ఎస్‌ఓడీసీ) సభ్యులుగా కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగోలు నియమితులయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఉత్తర్వులు జారీ చేశారు. దక్షిణ ఒడిశాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసింది. మండలి చైర్మన్‌గా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నిత్యానంద గొండ వ్యవహరిస్తుండగా.. తాజాగా సప్తగిరి, సత్యజీత్‌లను సభ్యులుగా నియమించడంపై కాంగ్రెస్ వర్గాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. తొమ్మిది మంది సభ్యులతో కొలువుదీరిన మండలి ప్రస్తుతం సభ్యుల సంఖ్య 11కు పెరిగింది.

అంబొదలలో ఎమ్మెల్యే పర్యటన



ఎమ్మెల్యే హికకకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని అంబొదలలో ఆదివాసీ సంప్రదాయ పండుగల్లో ఒకటైన మెరియా పండగలో బిసంకటక్ ఎంఎల్ఏ నీలమాధవ హికక పాల్గొన్నారు. బుధవారం పండుగ ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఆదివాసీల సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచే ఈ పండగలను జరుపుకోవాలని అన్నారు. అనంతరం అంబొదలలోని వీధుల్లా పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుకొని పరిష్కరానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా మౌలిక సౌకర్యాల మెరుగుకు త్వరిత తిన చర్యలు తీసుకుంటానని అన్నారు.

గణతంత్ర వేడుకలకు సన్నాహాలు



రిహార్సల్‌లో ఎన్‌సీసీ కేడెట్‌లు

రాయగడ: స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 26వ తేదీన జరగనున్న గణతంత్ర వేడుకలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా నిర్వహించే పరేడ్‌కు సంబంధించి రిహార్సల్స్ మొదలయ్యాయి. ఎన్‌సీసీ, ఎయిర్‌వింగ్ , వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ ప్యారెడ్‌లో భాగంగా రిహార్సల్‌లో పాల్గొంటున్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితురాలు

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ రెండో ఫ్లాట్ ఫాంలో 20 కిలోల గంజాయితో యువతి పట్టుబడింది. రైల్వే పోలీసులు, అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో స్టేషన్ ప్రాంగణాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఒక యువతి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. పట్టుబడిన నిందితురాలు న్యూఢిల్లీకి చెందిన మేఘా సాహాగా పోలీసులు గుర్తించారు. రాయగడ నుంచి న్యూఢిల్లీకి గంజాయిని అక్రమంగా తరలించేందుకు మంగళవారం సమతా ఎక్స్‌ప్రెస్ కోసం ఆమె రెండో ఫ్లాట్‌ఫారం వద్ద నిరీక్షిస్తున్న సమయంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.


స్కూల్ యూనిఫాంలో రూ. 8 కోట్ల అవినీతి



నాణ్యత లేని యూనిఫాం ప్రదర్శిస్తున్న ప్రదీప్ మఝి తదితరులు

కొరాపుట్: పాఠశాలల విద్యార్థినులకు సరఫరా చేసే యూనిఫాం కొనుగోలులో రూ.8 కోట్ల మేర అవినీతి జరిగిందని బీజేడీ మాజీ ఎంపీ ప్రదీప్ మఝి ఆరోపించారు. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఓ హోటల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి రూ.500 విలువైన స్కూల్ యునిఫాం అందజేయాలని ప్రభుత్వం సుమారు రు.25 కోట్లు విడుదల చేసిందని, అయితే రూ.120 విలువైన నాణ్యత లేని యునిఫాంను బాలలకు అందజేశారని చెప్పారు. బీజేపీ నాయకులు కుమ్మక్కై ఈ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. యూనిఫాం ఒక్క ఉతుక్కే పాడయ్యాయన్నారు. ఎటువంటి అర్హత లేని, కనీసం జీఎస్‌టీ నంబర్ లేని నాలుగు వస్త్ర దుకాణాల్లో 5 లక్షల యునిఫారాలు కొనుగోలు చేశారని చెప్పారు. ఈ మేరకు ఆధారాలతో కూడిన ఫిర్యాదు ప్రతిని విజిలెన్స్ కార్యాలయంలో అందజేశారు. దీంతో కేసు నమోదు చేశారు. సమావేశంలో బీజేడీ నాయకులు రవి పట్నాయక్, తపస్ త్రిపాఠి, ఆశిష్ పట్నాయక్, మంజులా మఝి, ప్రమోద్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి రాష్ట్రానికి ప్రధాని మోదీ



భువనేశ్వర్: భారత ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ త్వరలో మరోసారి రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈ నెల 28న నగరంలో నిర్వహించనున్న ఉత్కర్ష్ ఒడిశా - మేక్ ఇన్ ఒడిశా కాన్‌క్లేవ్-2025ను ప్రారంభించేందుకు రానున్నట్లు సమాచారం. నెల రోజుల స్వల్ప నిడివిలో ప్రధాన మంత్రి పర్యటన వరుసగా రెండోసారి కావడం విశేషం . ఈ నెల 9న ప్రవాసీ భారతీయ దివస్ సమ్మేళనం పురస్కరించుకుని రాష్ట్రానికి మోదీ విచ్చేసిన విషయం తెలిసిందే. ఒడిశా ప్రపంచ పెట్టుబడిదారులను ఆకట్టుకుని సామర్థ్యంతో కూడిన వృద్ధి సాధించే లక్ష్యంతో మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 28, 29 తేదీలలో వరుసగా రెండు రోజుల పాటు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 28 ఉదయం 10.35 గంటలకు ఢిల్లీ నుంచి స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారని అధికారిక వర్గాల సమాచారం. అక్కడి నుంచి మోటర్‌కేడ్‌లో 10.40 గంటలకు మేక్ ఇన్ ఒడిశా కాన్ క్లేవ్ ప్రాంగణమైన జనతా మైదానానికి 10.55 గంటలకు చేరుతారు. ఉదయం 11 గంటలకు ఉత్కర్ష్ ఒడిశా - మేక్ ఇన్ ఒడిశా కాన్‌క్లేవ్ 2025ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుంది. అనంతరం మోటర్‌కేడ్‌లో విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12.55 గంటలకు బయలుదేరి ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో జరిగే మరో కార్యక్రమానికి హాజరవుతారు.

గున్న ఏనుగు మృతి



మృతి చెందిన గున్న ఏనుగు

భువనేశ్వర్: నగర శివారులో నందన కానన్ జంతు ప్రదర్శన శాలలో గున్న ఏనుగు మృతి చెందింది. దీని వయసు 5 నుంచి 6 ఏళ్లుగా భావిస్తున్నారు. కరంజియా అడవుల్లో గుంపు నుంచి దారి తప్పి రావడంతో ఇక్కడ సంరక్షించారు. అయితే కొద్ది రోజులుగా అనారోగ్యం బారిన పడటంతో చికిత్స పొందుతూ బుధవారం మృత్యువాతపడింది.

150 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్ట్



గంజాయి బస్తాలతో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పప్పులూర్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆరు బస్తాల గంజాయిని కలిమెల పోలీసులు పట్టుకున్నారు. కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి మాట్లాడుతూ.. అడవి వద్ద గంజాయి ఉన్నట్లు ముందస్తు సమాచారం రావడంతో బుధవారం ఉదయం సిబ్బందితో వెళ్లామన్నారు. అక్కడ ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఆంధ్రా ప్రంతానికి గంజాయిని తరలించేందుకు సిద్ధం కావడంతో వారిని పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కలిమెల పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. పట్టుబడిన గంజాయి 150 కేజీలు ఉందన్నారు. నిందితులు యం.పి.వి 35 గ్రామానికి చెందిన మణింద్ర మానియా(29), యం.వి.90 గ్రామానికి చెందిన అపూర్వ మానియాగా గుర్తించామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. గంజాయి విలువ రూ.10 లక్షల వరుకు ఉంటుందన్నారు.

యువకుడు బలవన్మరణం



సుమల బిశాయి మృతదేహం

జయపురం: గావంచాతో ఉరిపోసుకొని యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ కట్రకుండ గ్రామంలో పూర్ణ బిశాయి కుమారుడు సుమల బిశాయి (19)మంగళవారం వ్యక్తిగత పనిపై సమీప బండిగుడ గ్రామానికి వెళ్లాడు. మధ్యాహ్న సమయానికి ఇంటికి వస్తానని చెప్పి వెళ్లిన సుమల బిశాయి సాయంత్రమైన తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బండిగుడ గ్రామంలో స్థానికుల నుంచి ఆరా తీశారు. సుమల ఇంటికని చెప్పి ఎప్పుడో వెళ్లిపోయాడని వారు తెలిపారు. ఎంత సమయం అయినా ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు సుమల స్నేహితులను, బంధువులను అడిగినప్పటికీ తమ వద్దకు రాలేదని చెప్పేశారు. దీంతో మరింత ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలలో గాలించారు. ఆ సమయంలో స్థానికులు బండిగుడ గ్రామం కొండవాగు సమీపంలో ఒక చెట్టుకు ఎవరో గావంచాతో ఉరి పోసుకొని ఉన్నారని చెప్పడంతో అక్కడకు వెళ్లిన కుటుంబ సభ్యులు సుమల బిశాయిగా గుర్తించారు. వెంటనే గావంచాను కోసి అతడిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల సమయంలో మరణించాడు. రామగిరి పోలీసు అధికారి అపమృత్యు అని కేసు నమోదు చేశారు. సుమల బిశాయి ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక ఏమైనా జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పుటాసింగిని సమితిగా గుర్తించండి



ర్యాలీలో పాల్గొన్న లంజియా సవరలు

• లంజియా సవర ఉన్నయన పరిషత్ డిమాండ్



సబ్ కలెక్టర్ సహోటకు వినతిపత్రం సమర్పిస్తున్న పరిషత్ నాయకులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పుటాసింగి, జల్తార్, జొరడ, టొలన, చిన్నాసరి, కులిసింగ్, టిటిమిరి, భీమపూర్ తదితర పంచాయతీలతో కలిపి పుటాసింగిను సమితిగా గుర్తించాలని పుటాసింగి ఉన్నయన పరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం గుణుపూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించింది. సంప్రదాయ వస్త్రాధారణతో వందల మంది లంజియా సవర తెగకు చెందిన ఆదివాసీలు ర్యాలీలా పాల్గొన్నారు. మెయిన్ రోడ్డులో ప్రారంభమైన ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోటకు పరిషత్ నాయకులు సమర్పించారు. అత్యధిక శాతం మంది లంజియా సవరలు ఈ ప్రాంతం అభివృద్ధికి సమితి ఏర్పాటు ఎంతో అవసరమని పరిషత్ అధ్యక్షుడు మాధ్యూ దలబెహర, కార్యదర్శి పరమ సబర్, ముఖ్యసలహాదారుడు దేవేందర్ సబరలు అభిప్రాయ పడ్డారు. అయితే గత ప్రభుత్వ హయాంలో లంజియా సవరల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన లంజియా సవర డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎల్ఎస్‌డీఏ) నామమాత్రంగానే ఉందని అన్నారు. సమితిగా గుర్తింపు పొందితే లంజియా సవరల ఆర్థిక, సామాజిక రంగాలు ఎంతో మెరుగు పడతాయని వినతి పత్రంలో పేర్కొన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు



వ్యాస రచన పోటీలలో విద్యార్థులు



వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి జయపురంలో సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళ, బుధవారాలలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దేశభక్తి పాటలు, సంగీతం, వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీలను నిర్వహించారు. ఒడియా, ఆంగ్ల భాషలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వక్తృత్వ పోటీల న్యాయ నిర్ణేతలుగా యుగళ కిశోర్ మిశ్ర, జనార్ధన సండ, సురేంద్ర పట్నాయక్, ప్రభాత్ కుమార్ రథ్,త పస్ కిరన్ త్రిపాఠీ వ్యవహరించారని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రకాశ పట్నాయక్ వెల్లడించారు. అలాగే క్విజ్ పోటీల న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ సురుష్ దాస్, దేశ భక్తి పాటల పోటీల న్యాయ నిర్ణేతలుగా మనోజ్ దాస్, భరత్ రథ్, అమర మిశ్ర, బిద్యుత్ ప్రభ పట్నాయక్, సుధాకర పండ, అభయ మిశ్ర, జి.మహేష్, శ్రీరామ్, ప్రణభ కులదీప్ వ్యవహరించారు. పోటీలలో విజేతలకు ఈ నెల 26వ తేదీన జరుగనున్న రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. జయపురం బ్లాక్ విద్యాధికారి చందన నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు పోటీల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించారన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో కులపతి దేవీప్రసాద్ మిశ్రా



రక్తదానం చేసిన విద్యార్థులు

జయపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని వక్తలు పేర్కొన్నారు. జయపురం విక్రమదేవ్ విశ్వద్యాలయం శిక్షక శిక్ష విభాగం, జాతీయ సేవా యోజన బ్యూరోలు సంయుక్తంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కులపతి ప్రొఫెసర్ దేవీప్రసాద్ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరైన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానానికి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం 57 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో స్నాతకోత్తర పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంతకుమార్ పాత్రో, శిక్షక శిక్షా విభాగం చీఫ్, ఎన్.ఎస్.ఎస్ బ్యూరో కోఆర్డినేటర్ డాక్టర్ మనోరంజన్ ప్రదాన్, టెక్నీషియన్లు అమ్లాన జ్యోతి దాస్, ప్రమోద్ ఖిలో, బి.ప్రతిభ పాత్రో, జయపురం సబ్ డివిజన్ రక్తదాతల మోటివేటర్ అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రౌళో తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరం ముగింపు వేదికపై అతిథులు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కోట్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మూడు రోజులు నిర్వహించిన కొరాపుట్ జిల్లా స్థాయి జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. కోట్‌పాడ్ బ్లాక్ విద్యాధికారి స్వప్నేశ్వరి నాయిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కోట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియ (ఎన్ఏసీ) చైర్మన్ ఎం.శంకరరావు పాల్గొని మాట్లాడారు. రెడ్‌క్రాస్ సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. శిక్షణ పొందిన జూనియర్ రెడ్‌క్రాస్ విద్యార్థులు రెడ్‌క్రాస్ సంస్థ ఆశయాలను అమలు చేస్తూ లక్ష్యాలను చేరాలని ఉద్బోధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు ముఖ్యఅతిథి బహుతులతో సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా చంద్రకళ బగర్త, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిశీలన కమిటీ అధ్యక్షులు గోకుల చంద్రపాఢీ, కోట్‌పాడ్ బాలికోన్నత పాఠశాల అధ్యక్షులు సుధీర్ కుమార్ మహంతి, కొట్‌పాడ్ ఉన్నత పాఠశాల అధ్యాపకులు గణేష్ పాఢీ, కోట్‌పాడ్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పంకజ కుమార్ పాత్రో, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మణి ప్రసాద్ పట్నాయక్, ఎన్ఏసీ కార్య నిర్వాహక అధికారి శ్రీమతి పూజా రౌత్ పాల్గొన్నారు. ముందుగా జిల్లా జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి హరేకృష్ణ మహరాణ నేతృత్వంలో భారీలో ర్యాలీలో 740 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుంభమేళాలో ఎమ్మెల్యే గౌరీశంకర్


త్రివేణి సంగమంలో స్నానమాచరిస్తున్న గౌరీశంకర్ మజ్జి

కొరాపుట్: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి పాల్గొన్నారు. బుధవారం పట్టణానికి పార్టీ కార్యకర్తలతో కలిసి త్రివేణి సంగంలో స్నానమాచరించారు. అనంతరం అయోధ్యలోని బాలరాముడిని దర్శించుకున్నారు.

వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

పర్లాకిమిడి: అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ట జరిగి ఏడాది గడిచిన సందర్భంగా పర్లాకిమిడిలోని హనుమాన్ మందిరం వద్ద బుధవారం విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు బైక్ ర్యాలీ చేపట్టారు. కరణం వీధిలో దేవీమఠం మహంత రామానంద దాస్ ర్యాలీని ప్రారంభించగా.. విశ్వహిందూ పరిషత్ కోశాధికారి హరిమోహన్ పట్నాయిక్, కార్యదర్శి లోకనాథ మిశ్రా, వెంటేశ్వర పాత్రో, బ్రోజో పట్నాయిక్, కైలాష్ పట్నాయిక్, కోట్ల యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సామగ్రి ధ్వంసంపై ఫిర్యాదు


ఆర్‌ఈఆర్‌ను పరిశీలిస్తున్న వంశధార, పోలీస్ అధికారులు

టెక్కలి: వంశధార ప్రధాన కాలువలో టెక్కలి మండలం పరశురాంపురం గ్రామ సమీపంలో 40 ఆర్‌ఈఆర్ (రీచ్ అండ్ రెగ్యులేటర్) సామగ్రి ధ్వంసం చేసిన వారిపై వంశధార అధికారులు టెక్కలి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల షట్టర్ వద్ద గేర్ బాక్స్‌లు, స్క్రూగేర్లు తదితర సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వంశధార డీఈ నవీన్, జేఈ భాస్కర్‌తో పాటు ఎస్‌ఐ రఘునాథరావు తదితరులు సంయుక్తంగా పరిశీలన చేశారు.

ఒడియా బడులను విలీనం చేయవద్దు


మాట్లాడుతున్న బృందావన్ దొళాయి

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 117 రద్దు చేసిన తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఒడియా మాధ్యమం, ఒడియా సెక్షన్ ఉన్నటువంటి పాఠశాలలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలుగు లేదా ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో విలీనం చేయవద్దని ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) డిమాండ్ చేసింది. ఈ మేరకు మండలంలోని సహలాలపుట్టుగ ఒడియా ఉన్నత పాఠశాలలో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అపోటా ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి మాట్లాడుతూ.. ఒడియా మాధ్యమం ఉపాధ్యాయులను ఇప్పటిలాగే ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. ఒడియా మాధ్యమం కొనసాగించడంతో పాటు 3 కి.మీ పరిధిలో ఒడియా మాధ్యమం ఉన్నత పాఠశాలలు లేని ప్రాథమికోన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. 35 మంది విద్యార్థులున్న ఒడియా ప్రాథమిక పాఠశాలలను మోడల్ ఒడియా ప్రాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గూడ్స్ రైలు ఢీకొని రెండు ఆవులు మృతి

ఆమదాలవలస: మండలంలో దూసి రైల్వేస్టేషన్ పరిధి సమీపంలోని రైల్వే గేట్ వద్ద బుధవారం గూడ్స్ రైలు ఢీకొని రెండు ఆవులు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు దూసిపేట గ్రామానికి చెందిన దవళ యతిరాజులు సాయంత్రం వేళ పశువులను మేతకు తీసుకొని వెళ్లారు. ఇంతలో మేత మేసుకుంటూ ఆవులు రైల్వే గేట్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌ను దాటుతుండగా విశాఖపట్నం నుంచి పలాస వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో సుదూర ప్రాంతానికి తుళ్లిపోయిన రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.2 లక్షలు విలువ చేసే ఆవులు తన కళ్లెదుటే మృతి చెందాయని యతిరాజులు కన్నీరుమున్నీరయ్యాడు. రైల్వే అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం


ఎం.ఎస్.స్వామినాథన్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురంలోని సెంచూరియన్ వర్సిటీలో జరుగుతున్న 'వాతావరణ మార్పులతో స్మార్ట్ వ్యవసాయం' రెండో రోజు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సెమినార్ హాల్‌లో వివిధ థీమ్స్ మౌళిక ప్రదర్శనలో రోజంతా జరిగింది. ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన అగ్రి బీఎస్సీ, బీటెక్ వ్యవసాయ విద్యార్థులు 200 పోస్టర్లను ప్రదర్శించారు. వ్యవసాయంలో జరుగుతున్న వినూత్న మార్పులు, వాతావరణ పరిస్థితుల వల్ల స్మార్ట్ వ్యవసాయం, డ్రోన్స్ వినియోగం, కృత్రిమ మేధ, యంత్రీకరణ, ఆటోమేషన్, పోస్ట్ హార్వెస్ట్ నిర్వహణపై అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రీతబద్రా, ఉపకులపతి సుప్రియా పట్నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పరిశోధకులకు జ్ఞాపికతో పాటు పురస్కారాలను అందజేశారు.


వ్యవసాయ పరిశోధన అధ్యాపకునికి పురస్కారం అందజేస్తున్న వర్సిటీ అధ్యాపకులు


వ్యవసాయ పరిశోధకులను సత్కరిస్తున్న సెంచూరియన్ వర్సిటీ సిబ్బంది

ధాన్యం కొనుగోలు చేస్తాం


గురండిలో కళ్లం వద్ద ఉన్న ఖరీఫ్ ధాన్యం

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గజపతి జిల్లా యంత్రాంగం నిర్ణయం మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో 2024–25 ఖరీఫ్‌లో 25 మండీలను ఏర్పాటు చేశామని సి.ఎస్.ఓ. ప్రఫుల్ల కుమార్ నాయక్ బుధవారం తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 77వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రథమ పర్యాయంలో 5 లక్షల 89 వేల 975 క్వింటాళ్ల ధాన్యం ఈ ఏడాది మార్చి న31 వరకు కొనుగోలుకు లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ధాన్యం క్వింటాకు రూ.2300, ఇన్‌పుట్ సబ్సిడీ రూ.800లు కలిపి రూ.3,100 రైతుల ఖాతాల్లో 24 గంటల్లో జమ అవుతుందని సి.ఎస్.ఓ తెలిపారు. ధాన్యం అమ్మకాలకు జిల్లా వ్యాప్తంగా 15,491 మంది రైతులు మండీల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలియజేశారు. అందువల్ల రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావొద్దని సి.ఎస్.ఓ తెలిపారు. రైతులకు ఏవైనా సందేహాలు, అభియోగాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1967ను సంప్రదించవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రమణమూర్తికి సీపీఆర్ చేస్తున్న ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది, (ఇన్‌సెట్లో) రమణమూర్తి

నరసన్నపేట: మండలంలోని దేవాది వద్ద జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎచ్చెర్ల మండలం కొత్తపేటకు చెందిన గరుగుబల్లి రమణమూర్తి (45) మృతి చెందాడు. తాను నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయాలు కావడంతో ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రమణమూర్తి గృహాల్లో మార్బుల్స్ అమర్చే మేస్త్రీగా చాలాకాలంగా పనిచేస్తున్నాడు. దీనిలో భాగంగా నిమ్మాడలో గ్రానైట్ మార్బుల్స్ కొనేందుకు ఉదయం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా దేవాది వద్దకు వచ్చేసరికి ప్రమాదానికి గురయ్యాడు. కాగా ప్రమాదం జరిగిన కొద్దిసేపటి వరకూ ఎవరూ గుర్తించలేదు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మడపాం టోల్‌గేట్ వద్ద ఉన్న ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించేసరికే మృతి చెందాడు. మృతుడికి భార్య పూర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదంపై రమణమూర్తి సోదరుడు తవిటినాయుడు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మరణించిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి రైలు కింద పడి మరణించాడు. అతని ఎడమ చేతిపై ఎంబటీఏ (మీటా) అని పచ్చబొట్టు వేసి ఉందని, అతని ఎడమ ఛాతిపై పాము గుర్తు, కుడి ఛాతిపై సిలువ గుర్తు ఉందని జీఆర్పీ పోలీసు అధికారి హరినాథ్ తెలిపారు. అయితే ఏ రైలు కింద పడి చనిపోయారు, ఏ ప్రాంతానికి చెందినవాడో తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు 94406 27567 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వైభవంగా రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విశాఖ వైద్య బృందం

జయపురం: రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా జయపురం రోటరీ క్లబ్‌వారు పలు ప్రజాహిత కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ యజ్ఞానిసిస్ మహాపాత్రో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జయపురం ధనేశ్వర్ శివ మందిరంలో భక్తులకు రక్షిత తాగునీరు సమకూర్చేందుకు ఆలయంలో వాటర్ ప్యూరిఫై యంత్రం ఏర్పాటు చేశారు. ఈ యంత్రాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ యజ్ఞానిసిస్ మహాపాత్రో ప్రారంభించారు. 26వ జాతీయ రహదారిలో గల కొరాపుట్ విజిలెన్స్ డివిజన్ ఎస్పీ కార్యాలయం ప్రాంతంలో జయపురం రోటరీ పీస్ టవర్ (శాంతి స్థూపం)ను ఏర్పాటు చేశారు. దీనిని డిస్ట్రిక్ట్ గవర్నర్ యజ్ఞానిసిస్ మహా పాత్రో ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. అగ్రసేన్ భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశాఖపట్నం నుంచి వచ్చిన వైద్యులు 90 మందికి వైద్య పరీక్షలు చేశారు. జయపురం రోటరీ సభ్యులు పాల్గొన్నారు.


డిస్ట్రిక్ట్ రోటరీ గవర్నర్‌తో జయపురం రోటరీ సభ్యులు


వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలు

పాఠశాల విద్య.. అంతా అస్తవ్యస్తం


తరగతి గదిలో పాఠాలు చెబుతున్న టీచర్

- సంస్కరణల పేరిట విద్యను నిర్వీర్యం చేస్తున్న కూటమి సర్కారు
- జీవో 117 ఉపసంహరణ పేరిట బురిడీ
- జిల్లాలో ఖాళీ కానున్న అనేక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు
- ఇంటర్ విద్యను అందిస్తున్న హైస్కూల్ ప్లస్‌కు స్వస్తి
- మిగులు టీచర్ల సంగతి తేల్చని సర్కారు

శ్రీకాకుళం న్యూకాలనీ:

పాఠశాల విద్యలో సంస్కరణల పేరిట కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసేస్తోంది. అటు అధికారులను, ఇటు ఉపాధ్యాయులను గందరగోళానికి నెట్టేస్తోంది. ఇదేంటని ప్రశ్నించే ఉపాధ్యాయ సంఘాల బాధ్యులను భయపెడుతోంది. మెమోల పేరిట బెదిరింపులకు పూనుకుంటోంది. ఏకపక్ష నిర్ణయాలతో విద్యావ్యవస్థను కొంతమంది చేతుల్లోకి తీసుకోవాలనే యోచన చేస్తోంది. సర్కారీ బడుల పిల్లలను కార్పొ'రేట్'కు ధారాదత్తం చేసేలా చంద్రబాబు సర్కారు కుటిల యత్నాలు చేస్తోందని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు.

జీఓ రద్దు పేరిట గందరగోళం..

వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో సంస్కరణలు చేపడుతున్న అధికారులు అటు విద్యార్థులతోపాటు ఇటు ఉపాధ్యాయుల భవితవ్యంపై సరైన ప్రకటన చేయడం లేదు. జీవో నెంబర్ 117ను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రభుత్వం చెప్పినప్పటికీ.. సవరణ ఉత్తర్వులు ఉపాధ్యాయులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. సవరణ ఉత్తర్వులు మరింత అధ్వానంగా.. ఏకంగా పాఠశాల విద్యనే గందరగోళానికి నెట్టేసేదేలా ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు గగ్గోలుపెడుతున్నారు. ప్రభుత్వం తన నిర్ణయాలను వెనక్కి తీసుకోకుంటే ఉద్యమబాట తప్పదని వారంతా సూటిగా హెచ్చరిస్తున్నారు.

3, 4, 5 తరగతులు మళ్లీ వెనక్కి..

గత ప్రభుత్వం జీవో 117ను అనుసరించి 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలోని ప్రాథమికోన్నత, హైస్కూల్స్‌లో విలీనం చేశారు. దీంతో 3వ తరగతి నుంచి విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చింది. ఈ విధానంలో ప్రాథమిక స్థాయి నుంచే విషయ పరిజ్ఞానం, విజ్ఞానం పెంపొందించేలా చేసే ఈ నిర్ణయాన్ని తల్లిదండ్రులు మెచ్చుకున్నారు. విద్యావేత్తలు కొనియాడారు. జిల్లాలో ఈ విధంగా 206 స్కూల్స్‌ను మెర్జ్ చేశారు. వీటిలో ప్రభుత్వ ఒకటి, ఎంపీపీ స్కూల్స్ 192, మున్సిపల్ ప్రైమరీ స్కూల్స్ 13 ఉన్నాయి. ఈ 206 ప్రైమరీ స్కూళ్ల విద్యార్థులను 176 హైస్కూల్స్‌లో మ్యాపింగ్ చేశారు. వచ్చే కొత్త విద్యాసంవత్సరంలో ఈ 176 పాఠశాలల్లో ఉన్న 3,4,5 తరగతుల విద్యార్థులను తిరిగి వెనక్కి తీసుకువచ్చి మోడల్, ప్రైమరీ పాఠశాలల్లో చేర్చనున్నారు.

హైస్కూల్ ప్లస్‌కు మంగళం..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంటర్ విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన హైస్కూల్ ప్లస్‌కు కూటమి సర్కారు స్వస్తి చెప్పింది. జిల్లాలో ఆరు హైస్కూల్ ప్లస్ విద్యాలయాలు ఉన్నాయి. వాటిని ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్‌లో భాగం చేయనున్నారు. దీంతో అక్కడ పనిచేస్తున్న పీజీటీలు పరిస్థితిపై స్పష్టత లేదు. ఈ లెక్కన జిల్లాలో 670 మంది వరకు స్కూల్ అసిస్టెంట్లు మిగులు టీచర్లుగా మిగిలిపోనున్నారు. ఇదే జరిగితే ముఖ్యమంత్రిగా మొదటి సంతకంతో.. మెగా డీఎస్సీ పేరిట ఇప్పటికే నిరుద్యోగులను దగా చేసిన చంద్రబాబు ప్రభుత్వం.. కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తుందా..? అనే అనుమానాలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

మోడల్‌స్కూల్ పేరిట 'సరికొత్త ఎత్తుగడ'..

పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌ను తీసుకురావాలని చూస్తున్నారు. 60 మందికి పైగా బాలబాలికలు ఉండే స్కూళ్లను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా కేటాయించాలని నిర్ణయించారు. జిల్లాలో 60 మంది విద్యార్థులు కలిగిన ప్రైమరీ స్కూళ్లు పట్టుమని మూడు కూడా లేవు. ఈ విధంగా మోడల్ ప్రైమరీ స్కూల్లు పేరిట ఉపాధ్యాయ పోస్టులను తగ్గించాలనే పన్నాగం పన్నారు. 60కిపైగా విద్యార్థులుంటే ఐదుగురు టీచర్లు, 60కి తక్కువుంటే కేవలం ఇద్దరు టీచర్లను నియమించాలనే కుయుక్తులకు శ్రీకారం చుట్టింది. ఈ పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ విధానాన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు బూటకంగా చూస్తున్నారు. విద్యార్థులుండే చోటు నుంచి ఒక కిలోమీటర్ దూరం వ్యవధిలోనే విద్యను అందించాల్సిందేనని విద్యాహక్కు చట్టంలో పేర్కొన్నప్పటికీ.. ఈ నిబంధనలను చంద్రబాబు సర్కారు పెడచెవిన పెడుతోంది. తాజా నిర్ణయాలతో రెండు మూడు కిలోమీటర్లు దూరం పోవాల్సిన పరిస్థితి దాపురించనుంది. అయితే అటువంటి విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు అందజేస్తామని ప్రభుత్వం పేర్కొంటుండటం కొస మెరుపు. కాగా ప్రభుత్వ నిర్ణయాలు, మార్గదర్శకాలపై న్యాయస్థానాలను ఆశ్రయించిన ఉపాధ్యాయులపై ప్రభుత్వ ఆదేశాల మేరకు శాఖా పరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని సమీక్షా సమావేశాల్లో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు హెచ్చరిస్తుండటం చర్చనీయాంశమవుతోంది.

దళితులంటే ఎందుకంత కక్ష

- టార్గెట్ చేస్తూ దాడులు చేయడం సరికాదు
- మంత్రి అచ్చెన్నాయుడి డైరెక్షన్‌లోనే దాడులు
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్


మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి దళితులంటే ఎందుకంత కక్ష అని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ప్రశ్నించారు. బుధవారం టెక్కలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో సొంత సామాజిక వర్గం పోలీసు అధికారులతో దళితులను టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడమే కాకుండా, టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ దాడులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోటబొమ్మాళి మండలం కిష్టుపురం గ్రామంలో దళిత కుటుంబం ఇంట్లోకి చొరబడి టీడీపీ కార్యకర్తలు దాడులు చేస్తే, వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేయకుండా బాధితులపై పోలీసులు బెదిరింపులకు పాల్పడ్డారని మండిపడ్డారు. టెక్కలి మండలం చాకిపల్లి గ్రామంలో దళిత సామాజిక వర్గానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ చుక్క గున్నమ్మ ఇంట్లోకి చొరబడి టీడీపీ కార్యకర్తలు దాడులు చేశారని, ఈ ఘటనలో దాడి చేసినవారిని వదిలేసి బాధితులతో పాటు అదే గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేసేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండలం ఎం.నర్సాపురంలో దళితులపై టీడీపీ కార్యకర్తలు దాడులు చేస్తే, అక్కడ కూడా పోలీసులు ఏకపక్షంగా దాడి చేసిన వారికి మద్దతుగా నిలిచారన్నారు. తాజాగా నందిగాంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జడ్యాడ జయరాంపై అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్టులు చేశారని దుయ్యబట్టారు.

టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారు

దళిత కుటుంబాల్లో రాజకీయ చిచ్చు రేపుతూ మంత్రి అచ్చెన్నాయుడి డైరెక్షన్‌లో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారని తిలక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధం లేని తగాదాల్లో ఇరికిస్తూ పోలీసులతో అక్రమంగా కేసులు నమోదు చేయడమే కాకుండా, అన్యాయంగా అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. దళితులతో పాటు ఇతర సామాజిక వర్గాల్లో వ్యాపార వర్గాలను టార్గెట్ చేస్తూ కక్ష సాధింపులకు పూనుకుంటున్నారన్నారు. పోలీసులంటే తమకు ఎంతో గౌరవం ఉందని, అయితే అచ్చెన్నాయుడు తన సొంత సామాజిక వర్గానికి చెందిన పోలీసులను కక్ష సాధింపులకు వినియోగించుకోవడం బాధాకరంగా ఉందన్నారు. టెక్కలి నియోజకవర్గంలో పోలీసులు తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. దళితులకు అండగా నిలబడి పోరాటం చేస్తామని భరోసానిచ్చారు. ఆయనతో పాటు నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ కురమాన బాలకృష్ణ, నాయకులు ఎ.విష్ణు, టి.నారాయణ, డి.కృష్ణారావు, బి.రాజేష్ ఉన్నారు.

ప్రభుత్వ తీరుతో పాఠశాలల ఉనికే ప్రశ్నార్థకం


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: జీవో 117 రద్దు, సవరణలు పేరిట విడుదల చేసిన మెమో పూర్తి లోపభూయిష్టంగా ఉందని, ఇది మొత్తం ప్రభుత్వ విద్యావ్యవస్థనే కబళిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి పేర్కొన్నారు. శ్రీకాకుళం క్రాంతి భవన్‌లో జరిగిన ఎస్టీయూ జిల్లా అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 117 సవరణల మెమోలో 60 మంది పిల్లలు కలిగిన ప్రతి ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఏర్పాటు చేయాలని, కానీ 60లోపు విద్యార్థులున్న పాఠశాలలను ఎప్పటిలానే యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. వాటిలో 3,4,5 తరగతులను సమీప పాఠశాలల నుంచి మోడల్ పాఠశాలలో విలీనం చేయవద్దని, అలాగే 6, 7,8 తరగతిలో 50మంది పిల్లలు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూల్‌గా ఉన్నతీకరణ చేయాలని, 50 మంది విద్యార్థులు లేని ప్రాథమికోన్నత పాఠశాలలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో రెండు మీడియంలు ఉండాలని, సెక్షన్ వారీగా కాకుండా రోల్ ప్రాతిపదికన పోస్టులు ఇవ్వాలని, హైస్కూల్ ప్లస్‌ను కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెద్దలు, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి 117 జీవో సవరణలో లోపాలను సరిదిద్దాలని.. అంతవరకూ విద్యార్థులు మ్యాపింగ్ ఆపాలని, లేనిపక్షంలో ఎస్టీయూతో కలిసొచ్చేసంఘాలతో ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, ఎస్.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరావు, కె.తేజేశ్వరరావు, ఎం.తేజేశ్వరరావు, కె.గడ్డెన్నాయుడు, మహిళా కార్యదర్శి వసంత కుమారి, పలు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

27న కురుపాంలో సంకల్ప మెగా జాబ్‌మేళా

పార్వతీపురం: కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 27న సంకల్ప మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని, 18-28 ఏళ్లలోపు వయస్సుగల నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఈ మేళాలో 23 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆసక్తి గల యువతీ, యువకులు హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకొని, రిఫరెన్సు నంబర్‌తో పాటు బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత, పాస్‌ఫొటోతో సోమవారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్:63034 93720, 89788 78557 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

పార్వతీపురంటౌన్: ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.20వేల కోట్లు బకాయిలను తక్షణమే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్‌సీ కోసం తక్షణమే పీఆర్‌సీ కమిషనర్ నియామకం పునరుద్ధరించాలని కోరారు. వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ, పీఆర్సీ బకాయిలు సుమారు రూ.20వేల కోట్ల విడుదలకు తగిన రోడ్డు మ్యాప్ ఇవ్వాలని కోరారు. మెమో 57 ప్రకారం సుమారు 11000 మంది 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీమ్ వర్తింపచేయాలన్న ఫైల్‌కు మోక్షం కలగకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, కె.భాస్కరరావు, జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.వెంకటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇస్తారా? ఏనుగులు తరలిస్తారా?


- అటవీశాఖ అధికారులను అటకాయించిన ఘనసర బాధితులు



అటవీశాఖ అధికారులను అడ్డుకున్న ఘనసర రైతులు

భామిని: ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలను ఏనుగులు గుంపు నష్టపరుస్తుంటే అటవీశాఖ అధికారులు చోద్యం చూడడంపై ఘనసర రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే పరిహారం చెల్లిస్తారా? లేదంటే ఏనుగులను తరలిస్తారో చెప్పాలని పట్టుబట్టారు. ఏనుగులను చూడడానికి వచ్చిన పాలకొండ, కురుపాం అటవీశాఖ అధికారులు రామారావు, గంగారావు, సంజయ్‌ను అడ్డుకున్నారు. పరిహారం సంగతి తేల్చే వరకు అధికారులను కదలనిచ్చేదిలేదంటూ రోడ్డుకు అడ్డంగా బైఠాయించారు. దీనిపై పార్వతీపురం డీఎఫ్ఓను సంప్రదించి గతంలో ఏనుగులు నష్టపరిచిన పంటలకు బాధిత రైతులకు పరిహారం ఇస్తామని అధికారులు సర్దిచెప్పారు. ఏనుగులను కొండపైకి పంపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెనుదిరిగారు.

అమ్మవారి ఘటాలు, పాలధార తిరువీధి



గ్రామంలో పాలధార తిరువీధి

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ అమ్మవారి ఘటాలు, పాలధార తిరువీధి కార్యక్రమం బుధవారం సాగింది. ముందుగా పాలధారను తిరువీధి జరపగా, భక్తులు ఎదురెల్లి పూజలు చేశారు. అమ్మవారి ఘటాలను చదురుగుడి నుంచి తిరువీధి నిర్వహించారు.

రెండు లారీలు ఢీ

బొబ్బిలిరూరల్: మండలంలోని గొర్లెసీతారామపురం పెట్రోల్ బంకు వద్ద బుధవారం తెల్లవారుజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్లు, క్లీనర్లు స్వల్పగాయాలతో బయట పడ్డారు. ఇరుకు రోడ్డు కావడం, రహదారి మధ్యలో ప్రమాదం సంభవించడంతో అటు రామభద్రపురం, ఇటు బొబ్బిలి గ్రోత్ సెంటర్ వరకు భారీగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం 5.30 గంటలకు ప్రమాధం జరగ్గా అప్పటినుంచి సుమారు 12 గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి లారీలను క్రేన్ల సహాయంతో రహదారి పక్కకు నెట్టివేయడంతో కొంతమేర ట్రాఫిక్ క్లియర్ అయింది. అలాగే విశాఖ, రాయగడ వైపు వెళ్లాల్సిన ప్రయాణికులు, స్కూల్ బస్సులు, భారీ రవాణా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బొబ్బిలి సీఐ సతీష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

ఉపాధి పనుల్లోనూ రాజకీయం!

- మేట్‌లుగా కూటమి కార్యకర్తలకే అవకాశం
- ఇప్పటివరకు 75 జాబ్‌కార్డులకు ఒక మేట్
- ఇప్పుడు ప్రతి 50 మంది వేతనదారులకు ఒక మేట్ నియామకానికి సన్నాహాలు
- మేట్‌ల నియామకానికి ఉత్తర్వులు జారీ
- ప్రతి వేతనదారు నుంచి రూ.1.50పైసలు మేట్‌కు చెల్లించేలా ఉత్తర్వులు
- రోజుకు రూ.75 చొప్పున కమీషన్



వీరఘట్టం మండలం కత్తులకవిటి సమీపంలోని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులు

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డుల సంఖ్య	2,08,059
మొత్తం వేతనదారుల సంఖ్య	3,93,303
ప్రస్తుతం ఉన్న మేట్‌లు	2,775 మంది
కూటమి ప్రభుత్వ తాజా ఆదేశాలతో జిల్లాలో ఉండే మేట్‌ల సంఖ్య	7,866

వీరఘట్టం: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వేతనదారులను కూటమి వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఎత్తుగడ వేసింది. వేతన దారులను మోటివేషన్ చేసి ఓటు బ్యాంకును పెంచుకునేందుకు కూటమికి, నాయకులకు అనుకూలంగా ఉన్న వారిని మేట్లుగా నియమించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ప్రతి 50 మంది వేతనదారులకు ఒక మేట్‌ను నియమించాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అదునుగా తమ అనుచరులను మేట్లుగా నియమించేందుకు గ్రామాల్లో చర్యలు మొదలయ్యాయి. ప్రతి వేతనదారుకు రూ.1.50 చొప్పున ప్రతిమేట్‌కు ప్రభుత్వం చెల్లిస్తుంది. అంటే ఒక మేట్ పరిధిలో ఉన్న 50 మంది వేతనదారులకు సంబంధించి రోజుకు రూ.75లను మేట్‌కు చెల్లిస్తుంది.

ఇదీ పరిస్థితి..

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్లలో 70 శాతానికి పైగా వైఎస్సార్‌సీపీ అభిమానులు ఉన్నట్లు నిఘావర్గాలు చెబుతున్నాయి. అందుచేత ఉపాధి హామీ పథకంలో కూటమి ప్రతినిధులు కూడా ఉండేలా ప్రస్తుత ప్రభుత్వం కొత్త ఆలోచనకు తెరతీసింది.ఇందులో భాగంగానే ప్రతి 50 మంది వేతనదారులకు ఒక కొత్త మేట్‌ను నియమించేందుకు చురుగ్గా కార్యాచరణ చేపట్టారు. గతంలో 75 జాబ్‌కార్డుదారులకు ఒక మేట్ ఉండేవాడు. ఇప్పుడు ప్రతి 50 మందికి ఒక మేట్ నియామకం చేపడుతుండడంతో పార్వతీపురం మన్యం జిల్లాలో గతం కంటే మేట్ల సంఖ్య మూడు రెట్లు పెరగనుంది.

7866మంది మేట్ల నియామకానికి కసరత్తు..

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధిహామీ పథకంలో 2,08,059 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఈ జాబ్‌కార్డుల పరిధిలో 3,93,303 మంది వేతనదారులు ఉన్నారు. వారంతా పనులకు వచ్చినప్పుడు పర్యవేక్షించేందుకు 2775 మంది మేట్లు ఉన్నారు. ఇది గతం..ఇప్పుడు వేతనదారుల సంఖ్యను బట్టి ప్రతి 50 మందికి ఒక మేట్ చొప్పున 7866 మంది మేట్లను కొత్తగా నియమించేందుకు కసరత్తు చేపడుతున్నారు.ఈ క్రమంలో గతంలో పనిచేస్తున్న మేట్‌లను తొలగించి వారిస్థానంలో కొత్త వారిని నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.



వీరఘట్టం మండలంలో పాల్లరోడ్డులో 5వ బ్రాంచ్ కాలువలో పూడికలు తొలగిస్తున్న వేతనదారులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మేట్ల నియామకం

కొత్తగా మేట్లను నియమించేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రతి 50 మంది వేతనదారుల పనితీరును పర్యవేక్షించేందుకు ఒక మేట్‌ను నియమిస్తాం. అలాగే ఇంతవరకు ఉన్న పాత వారిని తొలగించబోము. ప్రస్తుతం మేట్లుగా పనిచేస్తున్న వారు ఆందోళన చెందవద్దు. ఎవరి పని వారు చేసుకుంటారు.

పి.రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

పాత వారిని తొలగిస్తే ఊరుకునేది లేదు



ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న పాత మేట్లను తొలగిస్తారనే ప్రచారం గ్రామాల్లో బాగా సాగుతోంది. మీరు కొత్తవారిని నియమించుకోండి అంతేగానీ పాత వారిని తొలగిస్తే మాత్రం ఊరుకునేది లేదు. పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టేందుకు అధికారులు చొరవ చూపాలి.

జంపు కన్నతల్లి, జెడ్పీటీసీ, వీరఘట్టం

సీనియర్ వేతనదారులకు అవకాశం కల్పించాలి



ఉపాధి పనులు చేస్తున్న వారిలో సీనియర్ వేతనదారుల(50 ఏళ్లలోపు)కు మేట్లుగా అవకాశం కల్పించాలి.అంతేతప్ప ఇష్టం వచ్చినట్లు మేట్లను ఎంపిక చేయడం సమంజసం కాదు. ఉపాధి హామీ పనులకు రాజకీయ రంగు పులమొద్దు

దమలపాటి వెంకటరమణనాయుడు, ఎంపీపీ, వీరఘట్టం

వివాహిత ఆత్మహత్య



ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన తులసి

చీపురుపల్లి: అప్పులు తీర్చలేమనే బెంగతో చీపురుపల్లి పట్టణంలో ఓ వివాహిత బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు ఈ ఘటనపై హెచ్‌సీ రమణ అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రామాంజనేయకాలనీలో నివాసం ఉంటున్న వడ్డాది తులసి(43) బుధవారం తన ఇంటిలోని బెడ్‌రూంలో చీరతో ఉరివేసుకుంది. మృతురాలి భర్త క్షత్రియ రామ్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలు తులసి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా పాన్‌షాప్ నిర్వహిస్తుండగా భర్త రామ్‌సింగ్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే అప్పుల బాధతో పాటు అనారోగ్య సమస్యలు కూడా ఉన్నట్లు ఫిర్యాదులో భర్త పేర్కొన్నాడు. అప్పులు తీర్చలేమనే బెంగతో తన భార్య ఆత్మహత్యకు పాల్పడిందని ఫిర్యాదులో తెలిపాడు.

లారీ ఢీకొని భార్యాభర్తల మృతి

- బ్యాంకుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం





లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జయిన గొర్లి మన్మథరావు, అరుణకుమారి, (ఇన్‌సెట్లో) మృతులు మన్మథరావు, అరుణకుమారి(ఫైల్)

జియ్యమ్మవలస: మండలంలోని గడసింగుపురం గ్రామానికి చెందిన గొర్లి మన్మథరావు(38) అరుణకుమారి (32) బతుకు తెరువు కోసం విశాఖ జిల్లా అగనంపూడిలో నివాసం ఉంటున్నారు. మన్మథరావు వెల్డర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. సంక్రాంతి పండగకు గడసింగుపురం వచ్చి కనుమ మరుసటి రోజే అగనంపూడి వెళ్లి పోయారని గ్రామస్థులు తెలిపారు. బుధవారం అగనంపూడిలోని బ్యాంకుకు భార్యతో కలిసి వెళ్లి తిరిగి వస్తుండగా లారీ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన దంపతులకు తొమ్మిదవ తరగతి చదువుతున్న గొర్లి నిఖిల్ (14), ఏడవ తరగతి చదువుతున్న పాప నీలవేణి (12) ఉన్నారు. ఇటీవలే పండగకు వచ్చి గ్రామంలో కలియదిరిగిన వారు ఇలా అకస్మాత్తుగా మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రామనారాయణం ఓ అద్భుతం



రామనారాయణం ప్రాంగణాన్ని తిలకిస్తున్న అవసరాల శ్రీనివాస్ తదితరులు

విజయనగరం రూరల్: రామనారాయణం ఓ అద్భుత కావ్యమని, స్వయంగా రామాయణాన్ని కళ్లకు కట్టినట్లు కనిపించే దృశ్యకావ్యాలు అమోఘంగా ఉన్నాయని తెలుగు సినీనటుడు అవసరాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం విజయనగరం మండలంలోని రామనారాయణం ప్రాంగణాన్ని ఆయన సందర్శించారు. ఆలయం అంతా కలియదిరిగారు. ఆలయం లోపల ఉన్న రామాయణ గాథ చిత్రాలతో పాటు, వేదపాఠశాల, వాల్మీకి రీసెర్చ్ సెంటర్, అలాగే 80 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ప్రాంగణంలోకి అడుగుపెట్టిన క్షణం నుంచి పూర్తిగా ఓ అద్భుతమైన ప్రపంచం కనిపిస్తోందన్నారు. ఇంతటి అమోఘమైన ఆలయ రూపకర్తలకు అభినందనలు తెలపక తప్పదన్నారు.

జిల్లా వ్యాప్తంగా పశు ఆరోగ్యశిబిరాలు

- త్వరలో పాల ఉత్పత్తి పోటీలు
- జిల్లా పశుసంవర్ధక శాఖ జె.డి వైవీ రమణ



లేగదూడల ప్రదర్శనలో భాగంగా ప్రథమ బహుమతిని సంగం రెడ్డి అచ్చన్నకు అందజేస్తున్న జేడీ వైవిరమణ తదితరులు

గజపతినగరం: రాష్ట్రంలో పశుపోషణకు ప్రాధాన్యం ఇస్తూ తగిన నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వైవీ రమణ అన్నారు. ఈ మేరకు బుధవారం గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామంలో నిర్వహించిన పశుఆరోగ్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోను 20.1.2025నుంచి 31.1.2025వరకు పశు ఆరోగ్య శిబిరాలను, అవగాహన సదస్సులను ఏర్పాటు చేయనున్నామని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా పశువుల ఆరోగ్యానికి, వాటి ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించి ఆర్థికంగా అండగా ఉండేదుకు శిబిరాలు, సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉచిత పశుఆరోగ్య శిబిరాల ద్వారా పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు ఉచితంగా వైద్యం అందించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా తేలికపాటి శస్త్రచికిత్సలు, ఎదకు రాని, చూడి కట్టని, ఇతర గర్భ కోశవ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం అందిస్తామని జేడీ వైవీ రమణ రైతులకు తెలియజేశారు. అలాగే పశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా అన్ని గ్రామాల్లో సామూహికంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. రైతులు పశుకిసాన్ క్రెడిట్ కార్డు కలిగి ఉంటే ప్రభుత్వం బ్యాంకుల ద్వారా లోన్లు కల్పించే అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలో 407 గోకులాలను నిర్మించామని ఇంకా షెడ్‌లు కావాల్సిన ఎడల రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పచ్చగడ్డిని సాగు చేసుకునేందుకు వెయ్యి ఎకరాల భూమిని గుర్తించనున్నట్లు చెప్పారు.

త్వరలో పాలఉత్పత్తి పోటీలు

ఫిబ్రవరి నెలలో విజయనగరం, మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలో పాలఉత్పత్తి పోటీలను నిర్వహిస్తామని త్వరలో సమయాన్ని ప్రకటిస్తామని ఆసక్తి గల పాడిరైతులు పాల్గొనాలని సూచించారు. అనంతరం పాతబగ్గాం గ్రామంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా ప్రథమ బహుమతిని సంగం రెడ్డి అచ్చన్నుకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పశుసంవర్ధక శాఖ ఎ.డి సీహెచ్ చంద్రశేఖర్, డి.డి.దామోదర్‌రావు, మరుపల్లి వెటర్నరీ డాక్టర్ బి.వెంకటరమణ, స్థానిక సర్పంచ్ లెంక పద్మావతి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి



తాటిపూడి దేవి మృతదేహం

విజయనగరం క్రైమ్: పట్టణంలోని శాంతీనగర్‌లో నివాసం ఉంటున్న తాటిపూడి దేవి (16) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన దేవి మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చింది. ఇంట్లో అడుగుపెడుతూనే వాంతులు చేసుకుంటుండడంతో తండ్రి శ్రీనివాస్ ప్రశ్నించగా పేరు తెలియని పాయిజన్ తాగేసినట్లు చెప్పింది. వెంటనే మహారాజా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 6 గంటలకు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

కబడ్డీ జట్లకు 24 మంది ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు

గంట్యాడ: విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరగనున్న పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనేందుకు కబడ్డీ జట్ల ఎంపికలను మండల కేంద్రంలోని గంట్యాడ హైస్కూల్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 64 మంది పురుష క్రీడాకారులు, 37 మంది మహిళా క్రీడాకారులు హాజరు కాగా వారిలో పురుషుల జట్టుకు 12 మందిని, స్త్రీల జట్టుకు 12 మందిని ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్.నాగేశ్వరావు తెలిపారు.

ఏవోబీ వైపు మావోలు?

- కొద్దిరోజులుగా దండకారణ్యంలో కాల్పుల మోత
- క్యాడర్‌ను, అగ్రనేతలను కోల్పోతున్న మావోయిస్టులు
- మళ్లీ ఏవోబీవైపు అడుగులు వేయవచ్చన్న ప్రచారం
- మన్యం ప్రాంతాన్ని షెల్టర్ జోన్‌గా భావించే అవకాశం



సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు:

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు మీదుగా మన్యం వైపు మావోయిస్టుల అడుగులు పడనున్నాయా.. ఇన్నాళ్లూ తమకు ఆశ్రయమిచ్చిన దండకారణ్యంలో వరుస తుపాకుల మోతలతో అగ్రనాయకత్వాన్ని, క్యాడర్‌ను కోల్పోతున్న 'అన్నలు'.. షెల్టర్ జోన్‌గా మరలా ఏవోబీని ఆశ్రయించే అవకాశాలున్నాయా... ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు వర్గాల్లోనూ, సరిహద్దు గ్రామాల ప్రజల్లోనూ ఇదే చర్చ జోరుగా నడుస్తోంది. కొంతకాలంగా మావోయిస్టుల అలజడి లేకుండా మన్యం జిల్లా స్తబ్దుగా ఉంది. 2022లో ఏవోబీ నుంచి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వైపు అన్నలు తరలివెళ్లారు. ఆ తర్వాత చాలా ఏళ్లు దండకారణ్యంలోనే స్థావరం ఏర్పాటు చేసుకున్నారు. కొన్నాళ్లుగా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతకు కఠిన చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ఇటీవల కాలంలో ఒడిశా-ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో భీకరంగా కాల్పులు జరుగుతున్నాయి. పలువురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. మంగళవారం కూడా పెద్ద ఎత్తున మావోయిస్టులు తమ క్యాడర్‌ను పోగొట్టుకున్నారు. ఇలా వరుస ఘటనలతో దాదాపు 190 మందికి పైగా తమ అగ్రనాయకత్వంతో పాటు, విలువైన క్యాడర్‌ను కోల్పోవడంతో.. అక్కడ సురక్షితం కాదని భావిస్తున్న మావోయిస్టులు కొన్నాళ్లపాటు దూరంగా తల దాచుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఏవోబీ మీదుగా మన్యం వైపు తిరిగి వస్తారన్న ప్రచారం సాగుతోంది. దీంతో పోలీసు యంత్రాంగం కూడా అప్రమత్తమైనట్లు సమాచారం.

ఆయుధాలను పక్కన పెట్టి..

దండకారణ్యం వదిలి, మన్యం వైపు వచ్చే ఆలోచనలో ఉన్న మావోయిస్టులు... ఈ ప్రాంతాన్ని కేవలం షెల్టర్ జోన్‌గా మాత్రమే పరిగణించే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఇక్కడ వారి కార్యకలాపాలను పక్కన పెట్టి, కొద్దిరోజుల పాటు సాధారణ జీవనం గడుపుతారన్న చర్చ నడుస్తోంది. వారి ఆయుధాలను విడిచి, దళ యూనిఫారాలను పక్కన పెట్టి.. గిరి ప్రాంతాల్లో గిరిజనుల బంధువుల మాదిరిగానే సాధారణ జీవితం కొన్నాళ్లు గడిపే అవకాశం ఉందని తెలుస్తోంది. మరలా దండకారణ్యంపై పట్టు పెంచుకుని అటువైపు వెడలే వరకూ ఈ ఏవోబీని కేవలం షెల్టర్‌జోన్‌గానే పరిగణిస్తారని సమాచారం.

అధికార యంత్రాంగం అప్రమత్తం?

మావోలు ఏవోబీ వైపు వచ్చే అవకాశం ఉందని ఉన్నతాధికారుల నుంచి పోలీసు యంత్రాంగానికి హెచ్చరికలు వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైనట్లు సమాచారం. ఇప్పటికే పోలీసులతోపాటు ప్రత్యేక బలగాలు తరచూ కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. కల్వర్టుల కింద తనిఖీలు చేపడుతున్నాయి. గతంలో గిరి ప్రాంతాల యువతను తమవైపు తిప్పుకొనేందుకు పోలీసులు వినూత్న చర్యలు చేపట్టారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ గిరిశిఖర ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కొండ ప్రాంతాలతోపాటు, గిరిజనులు అధికంగా వచ్చే వారపు సంతల్లో ఓ వైపు జల్లెడ పడుతూనే.. మరోవైపు యువకులకు క్రీడా సామగ్రి, దుస్తుల పంపిణీ వంటివి చేపట్టేవారు. పార్వతీపురం డివిజన్ పరిధిలోని సాలూరు, పాచిపెంట, మక్కువ, పార్వతీపురం, కొమరాడ మండలాల్లో వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహించి, యువతకు చేరవయ్యారు. అదే మాదిరి మరలా కార్యక్రమాలు నిర్వహించేందుకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా కొన్నేళ్లుగా మావోల కదలిక లేకుండా స్తబ్దతగా ఉన్న మన్యం జిల్లా వైపు మరలా అన్నలు వస్తున్నారన్న వార్త జోరుగా ప్రచారమవుతోంది.

మన్యంలో మావోయిస్టుల ముద్ర..

శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్ కమిటీ తదితర దళాలతో గతంలో పార్వతీపురం మన్యం పరిసరాల్లో మావోయిస్టుల కదలికలు ఉండేవి. వారి ఉనికిని చాటుకునేలా కొన్ని సంఘటనలు సైతం చోటుచేసుకున్నాయి.

- 2001లో సీఐ ముద్దాడ గాంధీని సాలూరు కోర్టులో మావోయిస్టులు కాల్చి చంపారు.
- 2008లో పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఎగువశెంబిలో తాడంగి సొన్నంనాయుడును హతమార్చారు.
- 2012లో మక్కువ మండలం అలుగురు వద్ద భూమిలో పోలీసులకు మావోల డంప్ లభించింది.
- 2012లో మక్కువ మండలం ఎర్రసామంతవలసలో బీఎస్ఎన్ఎల్ టవర్‌ను పేల్చివేశారు.
- 2012లో ఏవోబీలో ఆంధ్రా సరిహద్దుకు కూతవేటు దూరంలో ఒడిశాలోని సుంకి వద్ద మావోయిస్టులు మైన్ ప్రూఫ్ వ్యాన్ పేల్చివేశారు. దీంతో నలుగురు బీఎస్ఎఫ్ సిబ్బంది మరణించారు.
- 2015లో సాలూరు సమీపంలోని ఏవోబీ ప్రాంతమైన రణసింగిలో పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి.
- 2016లో ఇన్‌ఫార్మర్ నెపంతో సాలూరు మండలం జాకరివలసలో పూసర్ల వెంకటరావును కాల్చి చంపారు.
- 2018లో పి.కోనవలస ఘాట్ రోడ్డు ముంగేరు గుమ్మి వద్ద మావోలు పేల్చిన మందుపాతరకు 8 మంది ఆర్మీ ట్రైనీ డ్రైవర్లు మరణించారు.
- 2018 మార్చిలో మక్కువ మీదుగా ఒడిశా సమీపంలో నారాయణపట్నం బ్లాక్ వద్ద పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు.
- 2018 అక్టోబరు నెలలో నారాయణపట్నం బ్లాక్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు.

